క్లుప్తంగా

రైతులకు రుణాలు పంపిణీ


తక్కెళ్లపాడులో రుణాలు అందజేస్తున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలోని 99 మంది రైతులకు రూ. 67.52 లక్షల రుణాలను శనివారం ఆ సంఘం చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, బ్యాంక్ మేనేజర్ రాంబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేసిన రైతులందరికీ వెంటనే తిరిగి సంఘం ద్వారా రుణాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది సంధ్య, మహేష్, సీఈఓ క్రిష్ణ, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

పెనుబల్లి: రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షలకు పైన ఉన్న రైతుల రుణాలను కూడా మాఫీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కొమ్మినేని సుధాకర్ కోరారు. శనివారం మండలంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో పట్టాదారు పాసు బుక్ లేకపోయిన పహణీలపై తీసుకున్న రుణాలకు కూడా రుణమాఫీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు.

ఏఓగా బాధ్యతలు చేపట్టిన మంజుఖాన్


మయాన్ మంజుఖాన్


వైరా: వైరా మండల వ్యవసాయశాఖ అధికారిగా మయాన్ మంజుఖాన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఏఓ ఎస్.ప వన్‌కుమార్.. ఖమ్మం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో టెక్నికల్ ఏఓగా బదిలీ కాగా.. ఆయన స్థానంలో మహబూబాబాద్ నుంచి మంజుఖాన్ బాధ్యతలు చేపట్టారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి


ప్లాస్టిక్ వస్తువులతో రూపొందించిన బొకేలు

మధిరరూరల్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాటూరు హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్ఎం సాయి కృష్ణమాచార్యులు కోరారు. శనివారం మాటూరు ఉన్నత పాఠశాలలో మాటూరు పూర్వ ఉపాధ్యాయిని హిందీ పండిట్ చాంద్ బేగం ఆధ్వర్యంలో ప్లాస్టిక్ బాటిల్స్‌ను వృథాగా పారవేయకుండా, వాటి సహాయంతో ఫ్లవర్ బొకేలను, బోధనోపకరణ వస్తువులు తయారుచేసే విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సాధ్యమైనంత మేరకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి



మాట్లాడుతున్న రామాంజనేయులు

కల్లూరు: అసంఘటిత రంగంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కల్లూరులోజరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కనీస వేతనం అమలుకై రాబోయే రోజుల్లో కార్మికులకు అవగాహన కలిగించి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యనిర్వాహన అధ్యక్షుడు రావి శివరామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు మోహన్‌రావు, రాంబాబు, దయాకర్‌రావు, నాగమణి, సునీత తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

సత్తుపల్లిరూరల్: మండలంలోని బేతుపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ నర్సింహారావు అత్తగారు కొప్పుల నర్సమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె పార్థివదేహానికి సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్‌లు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శివవేణు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాఖీ.. సందడి

- ఆకర్షణీయమైన మోడళ్లు
- జోరుగా స్వీట్లు, రాఖీల విక్రయాలు



చెమ్కీ, స్టోన్ లతో రూపొందించిన రాఖీలు


సత్తుపల్లిలో రాఖీలు విక్రయిస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: అన్నా చెల్లెళ్లు.. అక్కా తమ్ముళ్ల అనుబంధానికి రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుంది. అన్న చెల్లెళ్లు, అక్క తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు సూచకంగా రాఖీ పండుగను జరుపుకుంటారు. ప్రతి ఏటా శ్రావణ పౌర్ణమిరోజున ఈ పండుగ వస్తుంది. సోదరులు చల్లగా ఉండాలని కోరుతూ.. తోబుట్టువులు చేతికి రాఖీ కట్టి సోదరులు ఇచ్చే కట్నకానుకలు స్వీకరించి వారిని ఆశీర్వదిస్తారు. అత్తగారింటికి వెళ్లిన ఆడపడుచులు సైతం తమ సోదరులు రాఖీ కట్టడానికి ఈ పండుగ రోజున పుట్టింటికి వస్తారు. సోమవారం రాఖీ పండుగ నేపథ్యంలో పట్టణాల్లో రాఖీ, స్వీట్ల దుకాణాలు వెలిశాయి. రాఖీలు కొని తమ సోదరులకు రాఖీలు కట్టి తమ అనుబంధాన్ని దృఢం చేసుకోవటానికి సోదరీమణులు సిద్ధమౌతున్నారు.

ఆకర్షణీయంగా రాఖీలు..

ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగా మార్కెట్‌లో వివిధ రకాల మోడల్స్‌లో రాఖీలు వచ్చాయి. ప్రజలు, పిల్లలు కాంక్షలకు అనుగుణంగా మార్కెట్‌లో వైవిధ్య భరింతంగా రాఖీలు అందుబాటులోకి వచ్చాయి. డోరిమాన్, బ్రాస్‌లెట్, స్టోన్, సాధారణ చెమ్కీ రాఖీలు, కుందనళ్లతో చేసిన డిజైన్ల రాఖీలు మార్కెట్లో లభిస్తున్నాయి. డిజైన్‌ను బట్టి రూ.10 నుంచి రూ.500 వరకు రాఖీల ధరలు ఉన్నాయి. ఈ ఏడాది కొత్తగా అన్నయ్య రాఖీ, వెండిపూత రాఖీలు విక్రయిస్తున్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న సోదరులకు రాఖీ పౌర్ణమి నాటికి రాఖీలు చేరుకునే విధంగా పోస్టల్, కార్గో సర్వీస్‌లు, కొరియర్‌ల ద్వారా పంపించడానికి సోదరీమణులు నిమగ్నమయ్యారు. ఇంకా భిన్నంగా మార్కెట్‌లో వివిధ రకాల రాఖీలు ఉన్నాయి.

ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారి


ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు రాఖీ కడుతున్న దృశ్యం

వైరా: వైరాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్‌కు బ్రహ్మకుమారి సభ్యురాలైన గీతక్క రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండుగ నిలుస్తుందని తెలిపారు. టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, నాయకులు దార్నా రాజశేఖర్, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్ల మండలంలో..


చిన్నారులకు రాఖీలు కడుతున్న బాలికలు

కొణిజర్ల: మండలంలోని సమత సూపర్‌జెమ్స్ పాఠశాలలో శనివారం ముందస్తు రాఖీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు తమ సహచర బాలురికి రాఖీలు కట్టి సంబరాలు జరుపుకున్నారు. ప్రిన్సిపాల్, కరస్పాడెంట్ కొణతం ఉమాశంకరరావు రాఖీ పండుగ విశేషాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చాలా సంతోషంగా..


రాఖీ పౌర్ణమి రోజు అన్నయ్యను కలుసుకొని రాఖీ కట్టడం చాలా సంతోషంగా ఉంటుంది. అన్నయ్య కేరళలో బీటెక్ చేస్తున్నాడు. నేను హైదరాబాద్‌లో బీటెక్ చేస్తున్నా.. ఇద్దరం రాఖీ పౌర్ణమికి ఇంటికి వచ్చాం.

– కె.లక్ష్మీప్రియ, సత్తుపల్లి

ఆత్మీయ పండుగ..


అన్నా చెల్లెళ్ల ఆత్మీయ పండుగ రాఖీ పౌర్ణమిని ఎంతో సంతోషంగా జరుపుకుంటాం. సోదరుల ఉన్నతిని కోరుకుంటూ కట్టే రాఖీ సకల శుభాలు కలుగజేస్తుందని నమ్మకం. అందుకే ఈ రోజంటే ఎంతో ఇష్టం.

– వందనపు వర్షిణి, సత్తుపల్లి

ట్రెండీగా డిజైన్లు..


నేటి యువత ట్రెండ్‌కు తగ్గట్టుగా అనేక కొత్త మోడల్స్‌లో రాఖీలు అందుబాటులో ఉన్నాయి. పిల్లల నుంచి పెద్దల వరకు ఇష్టపడే విధంగా 450కి పైగా రకాల మోడల్స్ రాఖీలు విక్రయిస్తున్నాం. పండుగ దగ్గరకు రావటంతో విక్రయాలు బాగున్నాయి.

– చక్రి, వ్యాపారి, సత్తుపల్లి

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కల్లూరురూరల్: మండలంలోని పెద్దకోరుకొండి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్‌శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్‌శాఖ అధికారులు సాగు పొలాల వద్దకు వెళ్లి విద్యుత్ సరఫరా, నాణ్యమైన కెపాసిటర్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. పెనుబల్లి ఏడీఈ యాదగిరి మాట్లాడుతూ.. రైతులు విద్యుత్‌ను వృథా చేయకుండా మోటారు స్థాయికి సరిపోను కెపాసిటర్లను ఉపయోగించాలని కోరారు. ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రాల్లో ఒంగిపోయిన, విరిగిపోయిన విద్యుత్ స్తంభాలను సరి చేశారు. అదే విధంగా కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను బిగించారు. కార్యక్రమంలో పెద్దకోరుకొండి సబ్ స్టేషన్ ఏఈ తిరుపతయ్య, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శని త్రయోదశి పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీభ్రమరాంబికా మల్లిఖార్జునస్వామి ఆలయంలో శని త్రయోదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి అభిషేకాలు, నవగ్రహాలకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు రామడుగు గురుబ్రహ్మాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న కానిస్టేబుళ్లు

మధిర: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుల్ వెంకటకృష్ణ కుటుంబానికి శనివారం 2009 బ్యాచ్ కానిస్టేబుళ్లు ఆర్థిక సాయం అందించారు. మధిరకు చెందిన పోతురాజు వెంకటకృష్ణ కల్లూరులో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందారు. మధిర టీచర్స్ కాలనీలోని ఆయన నివాసంలో శనివారం దిశదిన కర్మ నిర్వహించగా.. ఈ కార్యక్రమానికి హాజరైన కానిస్టేబుళ్లు జంపయ్య, సాయిలు, గిరి, కొండ, భాస్కర్, శాంత కుమార్, సుమన్ మంగీలాల్, కృష్ణ, జనార్దన్ తదితరుల సహకారంతో సొసైటీ తరఫున రూ.2 లక్షలు వెంకటకృష్ణ కుటుంబ సభ్యులకు అందించారు.

వసతులు కల్పించాలి

కల్లూరు: విద్యార్థులకు పాఠశాలల్లో బోధించే పాఠాలు ఇంటి వద్ద చదువుకునే విధంగా తల్లిదండ్రులు స్టడీ కార్నర్ ఏర్పాటు చేయాలని ఎంఈఓ దామోదర ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థి పట్ల శ్రద్ధ వహిస్తూ ఇన్‌టైమ్‌లో సబ్జెక్ట్‌లు కంప్లీట్ చేసే విధంగా చూడాలన్నారు. ఫిజిక్స్ ఉపాధ్యాయులు రవిరాజు ఫిజిక్స్ ఎక్స్‌పర్‌మెంట్ చేసి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నివేదిత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు వంట పాత్రలు వితరణ

పెనుబల్లి: సప్తపది లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ మిట్టపల్లి జనార్దన్ ఇచ్చిన విరాళంతో వీయంబంజర్ ప్రభుత్వ పాఠశాలకు వంట పాత్రలను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు ఎస్‌కె అబ్దుల్ సలాం, సుబ్బారావు, శ్రీధర్, ఆనంద్, జయరాం, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నోట్‌పుస్తకాలు పంపిణీ

సత్తుపల్లిరూరల్: మండలంలోని సత్యంపేట, బంగ్లాబజార్ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, కంపాక్స్ బాక్స్‌లను శనివారం సుధాహెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు కొనకళ్ల సుధారాణి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదవాలని, విద్యార్థులను పనులకు పంపకుండా చదివించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు.

పీవీ విగ్రహాన్ని ప్రారంభించాలి


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

మధిర: భారతరత్న పీవీ నరసింహారావు విగ్రహాన్ని తక్షణమే ప్రారంభించాలని బీజేపీ మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణంలోని తహసీల్ ఎదుట 18 ఏళ్ల క్రితం పెట్టిన పీవీ నరసింహారావు విగ్రహాన్ని నేటికి ప్రారంభించలేదన్నారు. దీంతో ఈ నెల 15న తాము ముసుగుతీసి పాలాభిషేకం చేశామని, దీనిని తట్టుకోలేని కాంగ్రెస్ నాయకురాలు మేకల లక్ష్మీ విగ్రహానికి ముసుగు వేయడం బాధాకరమన్నారు. తక్షణమే విగ్రహాన్ని ప్రారంభించాలని.. లేకపోతే అఖిలపక్షాలతో కలిసి ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాంబశివరావు, రమేష్, స్వర్ణాకర్, సాయిరాం పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



బోనకల్: మాట్లాడుతున్న తహసీల్దార్ చందర్

బోనకల్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పున్నం చందర్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బీఎల్‌వోలు, కార్యదర్శులు, వైద్యసిబ్బంది, ఐసీడీఎస్, ఐకేపీ శాఖలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో జ్వరాల తీవ్రత అధికంగా ఉందని, శానిటేషన్, ఫాగింగ్ పనులు నిర్వహించాలన్నారు. ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలు, వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరిగి జ్వరాలపై సర్వే నిర్వహించాలన్నారు. కొత్త ఓట్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శాస్త్రీ, సీహెచ్ఓ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సీడీపీఓ బాలత్రిపుర సుందరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏన్కూరు: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ సకినాల రమేష్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండలస్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలుతున్నందున అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మౌనిక, సీహెచ్ఓ శివరాజ్, ఎంపీఓ జీవీఎస్ నారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలి


గాబులో ఉన్న నీటిని తొలగిస్తున్న సిబ్బంది

మధిరరూరల్: గ్రామాల్లో ప్రజలకు ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి కుళాయిల ద్వారా ప్రజలకు అందించే తాగునీరు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కమ్యూనిటీ హెల్త్ అధికారి వెంకటేశ్వర్లు కోరారు. శనివారం దెందుకూరు వైద్యుడు పృథ్వీరాజ్ నాయక్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో పారా మెడికల్ సిబ్బంది, గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ సిబ్బంది పనితీరును పరిశీలించి మాట్లాడారు. జీపీ సిబ్బంది ఓవర్ హెడ్ ట్యాంక్‌లో బ్లీచింగ్ కలిపే విధానం, ట్యాంక్ క్లీనింగ్ తదితర విషయాలపై పలు సూచనలు చేశారు. అనంతరం తొర్లపాడు బీసీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో జరిగే వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమాన్ని పరిశీలించి, అంగన్‌వాడీ పిల్లలు ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. గ్లాబులు, టైర్లలో, కూలర్లలో ఉన్న నీటిని తొలగించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు లంకా కొండయ్య, ఎఎన్ఎమ్ భారతి, అంగన్‌వాడీ టీచర్ నాగేంద్ర, సెక్రటరీ శ్రీనివాసరావు, ఆశ కార్యకర్త విజయమ్మ, శివ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన

బోనకల్: మండలంలోని లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 401, 220లో గల భూమిని ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించేందుకు శనివారం డీజీపీ అనీస్ అజాంతో పాటుగా మండల సర్వేయర్ కృష్ణమూర్తి సర్వే పూర్తి చేశారు. ఇంటిగ్రేటెడ్ రెషిడెన్షియల్ స్కూల్‌తో పాటు, ఇంటర్నేషనల్ స్కూల్‌కు కూడా సర్వేను నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, ఆర్ఐ అక్ష్మణ్‌నాయక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం

బోనకల్: మండలంలోని చిన్నబీరవల్లిలో మధిర కేవీఆర్ హాస్పటల్ అధినేత కోటా రాంబాబు ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. 500 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అనేక మంది విషజ్వరాల బారిన పడి కీళ్లనొప్పులతో బాధపడుతున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సంద్ర శ్రీలక్ష్మీ, మాజీ జెడ్పీటీసీ మోదుగు సుధీర్ బాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుర్గారావు, బాలరాజు, శాంతయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


అటెన్షన్ ప్లీజ్

మురుగు పారేదెలా..?

వైరా మండలంలోని కేజీ సిరిపురంలో గల ఇందిరమ్మకాలనీలో పారిశుద్ధ్యం పడకేసింది. డ్రెయిన్లు మురుగుతో పేరుకుపోవడంతో పాటు దుర్వాసన వస్తూ స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. అలాగే వర్షాకాలం కావడం, పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడం వలన పలు రకాల దోమలు వృద్ధి చెందిన స్థానికులు విష జ్వరాల బారిన పడుతున్నారని, అధికారులు స్పందించి మురునీటిని తొలగించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

– వైరారూరల్



ప్రశ్నించాల్సిన అధికారి :
జ్యోత్స్నదేవి, ఎంపీఓ, వైరా
సెల్ నంబర్ : 9704076329

వైద్య విద్యార్థిని మృతిపై పెల్లుబికిన నిరసనలు

కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, సిబ్బంది, పాఠశాలలు, కళాశాలలు, ప్రజా సంఘాలు, గ్రామీణ వైద్యుల ఆధ్వర్యాన శనివారం చేపట్టిన నిరసనలు పెల్లుబికాయి. ఈ సందర్భంగా ఆయా మండల కేంద్రాలు, ఆస్పత్రుల వద్ద విధులు బహిష్కరించి నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లకార్డులతో ఆందోళనలు చేపట్టారు. కొవ్వొత్తులు వెలిగించి ఆమెకు శ్రద్ధాంజలి ఘటించారు. హత్య జరిగి ఎనిమిది రోజులవుతున్నా.. దోషులను అదుపులోకి తీసుకోకపోవడం హేయమైన చర్య అని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాడతామన్నారు. హత్య సంఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, ఓపీ సేవలు నిలిపివేయడంతో రోగులు ఇబ్బంది పడ్డారు.

– సాక్షి నెట్‌వర్క్


సత్తుపల్లి రింగ్‌సెంటర్‌లో ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి, దయానంద్


వైరా: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్


ముదిగొండ: పీహెచ్‌సీ వద్ద వైద్య సిబ్బంది నిరసన


చింతకాని పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న వైద్యసిబ్బంది


కొణిజర్ల పీహెచ్‌సీ ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది


సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఏరియా ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది


బోనకల్‌లో పీహెచ్‌సీ ఎదుట..


చింతకాని పీహెచ్‌సీ వద్ద..


తల్లాడలో..